మాజీ మంత్రులను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల మండలం నుండి టిడిపి నాయకులు గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చం నాయుడుని, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడుని, మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావుని మరియు జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రని దోర్నాల మండల టిడిపి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు జిల్లా టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య, మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు దేసు నాగేంద్రబాబు, కోఆర్డినేటర్ పవన్, మండల టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి నాని, వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

ఎస్సైని సన్మానించిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-వెలిగండ్ల : నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వెలిగండ్ల ఎస్సై మహేష్ కుమార్‌ని వైఎస్ఆర్‌సిపి నాయకులు నాగూర్ యాదవ్, జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవ సహాయం సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పొల్లా సుబ్రమణ్యం, బిసి సెల్ అధ్యక్షులు యేలిక రమణయ్య, సేవల అధ్యక్షులు నల్లబతుల చెన్న కిష్టయ్య, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో వచ్చే సమస్యలను సున్నితంగా పరిష్కరించి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుప్పన బోయిన వెంకట్రామయ్య, చిలకల నారాయణరెడ్డి, దమ్ము కేశవులు, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకి ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

విశాలాంధ్ర-అద్దంకి : అనారోగ్యంలో బాధపడుతూ వైద్యం చేయించుకొని ఇళ్ళ వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని గోవాద గ్రామానికి చెందిన చెందిన జొన్నలగడ్డ శ్యాంబాబును, రావిపాటి వీరయ్యను, మాకినేని ఏడుకొండలును ఎమ్మెల్యే రవికుమార్ పరామర్శించారు.

ఆధార్ కార్డులో సవరణలు చేసుకోండి

విశాలాంధ్ర-అర్ధవీడు : అర్ధవీడు మరియు పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామపంచాయతీ ప్రజలు తమ ఆధార్ కార్డు నందు సవరణలు చేసుకోవాలని గురువారం ఎంపీడీవో వీరభద్రాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పాపినేని పల్లె సచివాలయంలో తాత్కాలికంగా ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తమ ఆధార్ కార్డు నందు పేరు ఫోన్ నెంబర్ ఇంటి అడ్రస్ ఫోటో మార్చుకోగలరని ఆయన తెలిపారు. 100 రూపాయల రుసుము చెల్లించి మార్చుకోగలరని తెలిపారు. అలాగే పాపినేని పల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. పలు దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కంభంలో విద్యుత్ నిలిపివేత

ఏఈ వెంకట నరసయ్య

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని కంభంలో నేటి ఉదయం 9 గంటల నుండి 11 గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కంభం ఏఈ వెంకట నరసయ్య ఓ ప్రకటన లో తెలిపారు. 132 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని కంభం ఏఈ వెంకట నరసయ్య కోరారు.

తహశీల్దార్‌కు నడిగడ్డ రైతుల వినతి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండల తహశీల్దార్‌కు నడిగడ్డ పేద రైతులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమం రైతు సంఘం నాయకులు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట నడిగడ్డ పేద రైతులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 2006లో ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిలో దిగేవిదంగా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ విన్నవించు కొన్నారు. కొందరు అగ్రవర్ణ నాయకులు ఎస్సీ, ఎస్టీ,బీసీలకు భూములు వుండటం ఓర్వనివారు కోర్టును ఆశ్రయించి బూమి సాగు నిలిచిపోయేలా చేశారు. ఇప్పటికీ అయినా అధికార్లు స్పందించి తమను భూమి సాగులో వుండేలా చూడాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు రామిరెడ్డి, రాజ, ఏలీయా మరికొందరు పేద రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై బస్సు యాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆంధ్రప్రదేశ్‌కి రాష్ట్రానికి ప్రత్యేక హోదా విభజన హామీల సాధన కోసం ఈ నెల 20 నుండి ఫిబ్రవరి 4 వరకు అనంతపురం నుండి శ్రీకాకుళం వరకు జరుగు బస్సు యాత్రను జయప్రదం చేయాలనీ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తెలిపారు. గురువారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ విభజన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్ని రాజకీయ పార్టీలు ద్రోహం చేశాయన్నారు. కేంద్రం ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న పాలక ప్రభుత్వాల్ని మోసం చేస్తూ రాష్ట్రానికి అన్యాయం చేసారన్నారు. రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 25 మంది ఎంపీలు ఇస్తే కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తెస్తానని నేడు మీనామెషాలు లెక్కపెడుతున్నారు. ఈ బస్సు యాత్రను అడ్డుకున్నందుకు ప్రభుత్వం అనేక రకాల చర్యలు ప్రారంభించిందని, ఎటువంటి ప్రభుత్వ నిర్బంధాలు వచ్చిన బస్సు యాత్ర జరుగుతుందని, దీనికి అన్ని వర్గాలు సహాయ సహ కారాలు అందించి, జయప్రదం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి ఎల్.రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజేంద్రబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబు, పీవైఎల్ జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పీవీఆర్ చౌదరి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, పిసిసి అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యాల కళ్యాణ్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు బాలచంద్రుడు నాయక్ పాల్గొన్నారు.

నేడు చందలూరు హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష

విశాలాంధ్ర-జెపంగులూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు ఏడాదికి 12,000 రూపాయలు చొప్పున స్కాలర్ షిప్ పొందే అవకాశం ఉన్న ఎన్.ఎం.ఎం.ఎస్. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు 20వ తేదీ శుక్రవారం చందలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోడల్ పరీక్ష నిర్వహి స్తున్నట్లు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డేపల్లి వీరనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశా లల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయడానికి అర్హులని ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ఏడాదికి 12 వేల రూపాయలు ఉపకార వేతనం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఉపకార వేతనంతో పాటు వెలకట్టలేని ఆత్మవిశ్వాసం కలుగుతుందని ఆయన చెప్పారు. చక్కని అధ్యయన అలవాట్లకు ఉత్ప్రేరకంగా ఈ పరీక్ష ఉపయోగ పడుతుందన్నారు. ఈ పరీక్ష ఫిబ్రవరి 4వ తేదీన జరుగుతున్నందున, అద్దంకి నియోజక వర్గంలోని పరీక్షకు సిద్ధమవు తున్న విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 20వ తేదీన శు క్రవారం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 9949 001428 ఫోన్ నెంబర్‌ను సంప్రదిం చాలని కోరారు. పరీక్షకు హాజరయ్యే విద్యా ర్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

పీడీఎఫ్ పట్టభద్రుల, ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ ఇటపు బాలసుబ్రమణ్యం

విటపు బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విశాలాంధ్ర-వెలిగండ్ల : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు పుక్కిరెడ్డి బాబురెడ్డి, మేఘాడ వెంక టేశ్వర్‌రెడ్డిలను గెలిపించాలని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ ఇటపు బాలసుబ్రమణ్యం కోరారు. గురువారం మండలంలోని మొగులూరు, కస్తూర్బా గాంధీ, వెలిగండ్ల, పి.యన్. వరం గుడిపాటి పల్లి హై స్కూల్ నందు ప్రకాశం నెల్లూరు చిత్తూరు జిల్లాల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో పోటీ చేస్తున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ పట్ట భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను పుక్కిరెడ్డి బాబు రెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డిలను పోటీ చేస్తున్నందున ప్రతి పాఠశాలలో తిరిగి వ్యక్తిగతంగా కలిసి గెలిపించాలని కోరారు. ఈ క్రమంలో ఆయన మాట్లా డుతూ నూతన విద్యా విధానంలో బడులు మూత, ఫెర్టిలైజేషన్ జూనియర్ డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాలకు విశ్వ విద్యాలయాలకు విద్యా బడ్జెట్లో 3 వంతు కేటాయింపు డీఎస్సీ ప్రకటించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయటం జిపిఎస్‌ను ప్రవేశపడితే ప్రతిఘటి స్తామని ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు ఒక బలమైన వేదిక కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం ఔట్సోర్సింగ్ పార్ట్ టైం తదితర ఉద్యోగులకు భద్రత కల్పించడం, గౌరవ వేతనాలు ఇచ్చే లాగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని రాబోయే రోజుల్లో కూడా పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ఎమ్మెల్సీ ఓటర్స్ ఉన్న ప్రతి ఒక్కరూ మొదటి ఓటు వేసి గెలిపించుకోవాలని, అదేవిధంగా ఉద్యోగ కార్మిక రైతు స్కీం వర్కర్లు శ్రమజీవుల కష్టజీవుల కోసం ఎల్లప్పుడూ పాటుపడతారని వారన్నారు. జెవివి నాయకులు మాలకొండారెడ్డి ఉపాధ్యాయ బృందం జిల్లా సిఐటియు సభ్యులు రాయళ్ల మాలకొండయ్య, కండే బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలినేనితో కలిసి వెంకటగిరిలో పర్యటించిన చింతలచెరువు

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పోరేషన్ చైర్మన్ వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు చింతలచెరువు సత్య నారాయణరెడ్డి గురువారం మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి పర్యటించారు. వెంకటగిరి నియోజక వర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామకృష్ణారెడ్డితో సంక్షేమ పథకాల అమలు గురించి వారు చర్చించు కున్నారు. అదే విధంగా 2024లో తిరిగి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి సామాన్య కార్యకర్త కృషి చేయాలని నియోజకవర్గంలో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తెలుసు కునేందుకు విస్తృత పర్యటనలో పార్టీ కార్యక్రమాలను కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయాల కోఆర్డినేటర్ పుత్త శివశంకర్ రెడ్డి, వైఎస్ఆర్‌సిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అనుమతులు పొంది వెంచర్లు ప్రారంభించాలి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు పొంది నిబంధనలకు అనుగుణంగా వెంచర్లు వేయాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కూడా వుడా వైస్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం కనిగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఒంగోలు పట్టణ అభివృద్ధి సంస్థ కనిగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అనధికార లేఅవుట్లు మరియు వాటి వలన కలుగు అనర్థాలపై అవగాహన కార్యక్రమం కమిషనర్ డివిఎస్ నారాయణరావు అధ్యక్షతన జరిగింది. తహశీల్దార్ పుల్లారావు మాట్లాడుతూ చుక్కల భూమి, అసైన్మెంట్, పోరంబోకు, ఈనామ్ భూములు వెంచర్లు వేయరాదని అవగాహన కల్పించారు. సెటిల్మెంట్ భూముల్లో వెంచర్లు వేసే క్రమంలో ప్రభుత్వ అనుమతులు పొంది వుడా నిబంధనల ప్రకారం వెంచర్లు వెయ్యాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన అనుగుణంగా రియాల్టర్లు వెంచర్లు వెయ్యాలని గతంలో వేసిన వాటికి అధికారులు పెద్ద మనసుతో మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కనిగిరి రియల్టర్ల సంఘం అధ్యక్షుడు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మాజీ అంజుమన్ కమిటీ సభ్యుడు షేక్ లతీఫ్ మాట్లాడుతూ గతంలో వేసిన వెంచర్లకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కొంతమేర సడలింపు ఇవ్వాలని కోరారు. రియాల్టర్లతో పాటు ఇళ్ల స్థలాల అమ్మకాల కొనుగోలు చేసే మధ్యవర్తులు వందల మంది జీవనోపాధిగా ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని అధికారుల దృష్టికి రియల్టర్ల సమస్యను తీసుకుని వెళ్లారు. గతంలో వేసిన అసైన్మెంట్, చుక్కల భూముల్లో వేసిన వెంచర్లను మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనకు అనుగుణంగా స్థలాల రిజిస్ట్రేషన్ ఉంటే విద్యుత్ సౌకర్యం ఇవ్వటానికి అనుకూలంగా ఉంటుందన్నారు. కమిషనర్ నారాయణరావు, చైర్మన్ అబ్దుల్ గఫూర్, ఎంపీడీవో మల్లికార్జునరావు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వెంచర్లు ఎలా వేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వుడా ప్రాజెక్ట్ ఆఫీసర్ హిమబిందు పాల్గొన్నారు.

పిల్లలు బడిలో ఉండి చదువుకోవాలి

ఏపీ చైల్డ్ ప్రొడక్షన్ కమిషన్ సభ్యురాలు పద్మావతి

విశాలాంధ్ర-జెపంగులూరు : పిల్లలు బడిలో ఉండి చదువుకోవాలని, పెద్దలు పనిచేసి డబ్బు సంపాదించాలని, ఆంధ్రప్రదేశ్ చైల్డ్ ప్రొడక్షన్ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని పలు రికార్డులను, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. నంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె విద్యార్దులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్స్ ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అంగన్వాడీలు, సీఆర్పీలు బడి బయట పిల్లలను బడిలో చేరేందుకు వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి వారిని బడిలో చేర్పించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు సిబిఎస్ సిలబస్, ట్యాబ్‌లు ఇవ్వటం వలన చదువులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారయ్యాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ కొరిశపాడు ప్రాజెక్టు సిడిపిఓ కృష్ణ కుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుమ్మా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రదర్ అనిల్ కుమార్‌ను కలిసిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బావ షర్మిల భర్త బ్రదర్ అనిల్ కుమార్ గురువారం సి.యస్ పురం నందు ఒక ప్రైవేట్ కార్యక్రమానికి హాజరవ్వడానికి వెళ్తూ మార్గమధ్యమైన పామూరు పట్టణంలోని స్వాగత్ లాడ్జిలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ రెండో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ అతని మిత్రులు అనిల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది. వెంకటేష్ మాట్లాడుతూ బ్రదర్ అనిల్ కుమార్‌ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రిరెడ్డి, రామ్మూర్తి, బండి రమేష్ పలువురు మిత్రులు పాల్గొన్నారు.

ఐక్యతకు క్రీడలు దోహదం

– మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-పామూరు : శారీరిక దారుఢ్యంతో పాటు మానసికల్లాసం, యువతలో ఐక్యతకు క్రీడలు దోహదపడతాయని కనిగిరి మాజీ శాసనసభ్యులు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలోని ఎర్రమట్టి గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం సాయంత్రం ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యతో పాటు ఆటపాటల పట్ల ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా యువత క్రీడలలో పాల్గొని తమ నైపుణ్యాన్ని చాటాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి బో మాల్యాద్రి చౌదరి, మన్నం రమణయ్య, పందిటి హరీష్, షేక్ కాజా రంతుల్లా, దేవరపు మాల్యాద్రి, పువ్వాడి రామారావు, నర్సింగ్ సాంబయ్య, మొబీనా మౌలాలి పాల్గొన్నారు.

ప్రయాణంలో కుటుంబాన్ని గుర్తు పెట్టుకోండి

– అమర నాయక్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : వాహనంపై ప్రయాణించే టప్పుడు కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలని మార్కాపురం రోడ్ ట్రాన్స్పోర్ట్ అధికారి అమర నాయక్ అన్నారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక ఆర్టీసి బస్టాండ్ సెంటర్లో రోడ్ భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర నాయక్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో మందు తాగరాదని సూచించారు. కారులో వెళ్లే ముందు సీట్ బెల్ట్ తప్పక పెట్టుకోవాలని,సెల్ ఫోన్ మాట్లాడరాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని అన్నారు. 4 చక్రాల వాహనంపై కూలీలు తీసుకువెళ్ళే ఆటో డ్రైవర్లు క్యాబిన్ పై ఏకించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ ఇన్స్పెక్టర్ మాధవరావు, పోలీస్ కరీం, మరికొందరు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరివర్తన పథకంపై శిక్షణ

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని ముండ్లపాడు మరియు బురుజుపల్లి గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకము మీద గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సమాచాలకులు డి బాలాజీ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయంలో వేసవి దుక్కులు, భూసారా పరీక్షలు, విత్తనం శుద్ధి, ఎరువుల యాజ మాన్యం, పచ్చి రొట్ట పైరులు వేయడం, సమగ్ర పంటల యాజ మాన్యం, ఆధునిక యంత్రాల వినియోగం వంటి యాజమాన్య పద్ధతులు పాటించడం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు. వై విజయభాస్కర్‌రెడ్డి మండల వ్యవసాయధికారి, గిద్దలూరు వారు ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఈకేవైసీ పంట నమోదు చేసుకోవాలని చూసించారు. అదేవిదంగా ఈకేవైసీ కూడా చేసుకోవాలని మరియు పీఎం కిసాన్ ఈకేవైసీ కానివారు 21వ తేది లోపు చేయించు కొన్న యెడల 22న డబ్బులు జమ అవుతాయన్నారు. భూగర్భశాఖ ఏపీడీ బి రోశమ్మ భూగర్భజలం ప్రస్తుత స్థితి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, షార్ప్ సంస్థ అధికారులు శిలార్, లక్ష్మయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

యర్రగుంట్ల వివాహ వేడుకల్లో ఉగ్ర

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని జిల్లెల్లపాడు గ్రామానికి యర్రగుంట్ల కళ్యాణ్ వివాహ వేడుకల్లో గురువారం తెలుగుదేశం నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వధూవరులు నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో తమ జీవిత భాగస్వామిగా ఉంటూ కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి మాజీ మండల అధ్యక్షులు దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు యద్దనపూడి సాల్మన్ రాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరు మౌలాలి, యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి, చందా బాలకాశిరెడ్డి, తిట్ల నారాయణ, మోటాటి వెంకటసుబ్బారెడ్డి, కొండయ్య, బండి శ్రీను, బ్రహ్మయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Shaik Mokthyar Begum** (Old Name), **W/o Mastan Shaik** (Old Name), R/o. D.No. 13-34, John Master Street, Marturu, Prakasam District, Andhra Pradesh - 523301. Changing my name from Shaik Mokthyar Begum (Old Name) to **SHAIK MUKTAR BEGUM** (New Name) and my husband name Mastan Shaik (Old Name) to **SHAIK MASTAN VALI** (New Name). Hence forth I am being called as **SHAIK MUKTAR BEGUM** and my husband name as **SHAIK MASTAN VALI** for all purposes.

CHANGE OF NAME

I **Shaik Mastan Vali, S/o John Saheb Shaik,** R/o. D.No: 13-34, John Master Street, Marturu, Prakasam District, Andhra Pradesh 523301. Changing my wife name from Moktyar Begum Shaik (Old Name) to **SHAIK MUKTAR BEGUM** (New Name). Hence forth my wife is being called as **SHAIK MUKTAR BEGUM** for all purposes.

ఉపాధి పనులను పరిశీలించిన ఏపీఓ

విశాలాంధ్ర-పెద్దారవీడు : మండలంలోని సుంకేసుల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పనులను ఏపీవో సాంబశివయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో సమావేశమై కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులను చేయాలని కూలీలకు తెలియజేశారు. కనీస వేతనం రూ.257 రావాలంటే ప్రభుత్వం ఇచ్చిన కొలతలు అనుసరించి కనీసం నాలుగు గంటలు పనిచేయాల్సి ఉంటుందని కూలీలకు వివరించారు. అలా చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరు చేస్తామని కనుక ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం గ్రామంలో కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుడ్డెపోగు రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సానికొమ్ము మల్లారెడ్డి, సీనియర్ మేటు ప్రసాదు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం

విశాలాంధ్ర-తాళ్లూరు : తాళ్లూరు పంచాయతీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో గల శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుండే ఆలయ పూజారి సాయిరాం సాయిబాబా మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలతో, పూలమాలలతో అందంగా అలంకరించి, కాకడ హారతి తదితర ప్రత్యేక హారతులు ద్వారా పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. తదనంతరం మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తాళ్లూరుకు చెందిన కే శ్రీను దేవాలయంలోని భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం విశేషం.

గ్రామ సచివాలయ ఉద్యోగాలకు గ్రామీణ యువతకు శిక్షణ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కృషి చేసే గ్రామీణ యువతకు అందుబాటులో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఝాన్సీ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ పొట్టేటి అశోక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయంలో ఖాళీల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది అన్నారు. దీనికోసం ఈ నెల 20వ తేదీ నుండి శిక్షణ తరగతులు నిర్వహిస్తాం అన్నారు. యువత కలను సాకారం చేయడానికి నిపుణులు అయిన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలోనే ఝాన్సీ ఒకేషనల్ కాలేజీపై అంతస్తులో నిర్వహించినట్లు తెలిపారు. పూర్తి వివరాల కొరకు 88974 20862, 7093621555. నెంబర్లకు సంప్రదించ వలసినదిగా ఆయన కోరారు.

వృత్తిని కోర్టుకి, కవిత్వాన్ని గుండెకు అంకితం చేసిన హనుమారెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : వృత్తిని కోర్టుకి, కవిత్వాన్ని గుండెకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రకాశంజిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షులు భీమనాథం హనుమారెడ్డి అని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. హనుమారెడ్డి తృతీయ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక రాజాపానగల్ రోడ్డులోని జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఇరవై ఐదు సంవత్సరాలు రచయితల సంఘానికి అధ్యక్షుడిగా పనిచేసి ప్రకాశంజిల్లా సాహిత్య రంగానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ హనుమారెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవాలను జరుపుకోవడమే కాకుండా తెలుగు లోగిలి పేరుతో వంద వ్యాసాలతో వెయ్యి పేజీలతో వ్యాస సంకలాన్ని ముద్రించి తెలుగు సాహితీ ప్రపంచానికి కానుకగా అందించిన సాహితీ మూర్తి హనుమారెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకాశంజిల్లా రచయితల సంఘం సభ్యులు బీనీడి కృష్ణయ్య, గంగిశెట్టి నరసింహారావు, సయ్యద్ ఇస్మాయిల్, ఆవుల వెంకటరమణ, యర్రగొండపాలెం తెలుగు సంస్కృతి సమితి అధ్యక్షులు డాక్టర్ మూడమంచు వెంకటేశ్వర్లు, సృజన సాహితీ సమితి పూర్వ అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్, కందుకూరు కళ్యాణ భారతి అధ్యక్షులు వివి శేషయ్య, కనిగిరి సాహితీసుధ ప్రధాన కార్యదర్శి పాలూరి శివప్రసాద్, ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్ జాన్, అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎం.వి.ఎస్ శాస్త్రి, లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంతవేలూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రపంచానికి తెలుగువారిని పరిచయం చేసిన ఎన్టీఆర్

సినీ నటుడు నారా రోహిత్

విశాలాంధ్ర-యద్దనపూడి : ప్రపంచానికి తెలుగువారిని పరిచయం చేసిన ఏకైక వ్యక్తి నందమూరి తారక రామారావు అని సినీ నటులు నారా రోహిత్ అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా 5వ రోజు కీ.శే గుదే సుబ్బరామయ్య, శ్రీనివాసమ్మ కళా ప్రాంగణంలో జరిగిన నాటికల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. సభాధ్యక్షులుగా గుదే పాండురంగారావు, విశిష్ట అతిథిగా నాటక సినీ రచయిత బుర్రా సాయి మాధవ్, గౌరవ అతిథి సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు, సన్మాన గ్రహీత నాటక రచయిత దర్శకులు జరుగుల రామారావు పాల్గొన్నారు. బుర్ర సాయి మాధవ్ మాట్లాడుతూ భారతదేశ రాజకీయాలను మార్చిన శక పురుషుడు ఎన్టీఆర్ అని తెలుగు జాతి ఉన్నంతవరకు గుర్తుపెట్టుకోవాల్సిన వ్యక్తులు ఎన్టీఆర్, పొట్టి శ్రీరాములు, ప్రకాశం పంతులు అని సినీ రంగంలో అన్ని పాత్రలు చేయగల నటుడు ఎన్టీఆర్ ఒక్కరేనని ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరని అన్నారు. రాజకీయాలలోమొట్టమొదట సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది ఎన్టీఆర్ అని, తాను నాటిక కుటుంబంలో పుట్టినప్పటికీ ఏది మంచి ఏది చెడు అని నేర్చుకున్నది మాత్రం ఎన్టీఆర్ సినిమాలు చూసేనని, ఎన్టీఆర్ తనకు ఆదర్శం, ఒక మార్గదర్శి అని అన్నారు. నాటిక రచయిత జరుగుల రామారావును ఘనంగా సన్మానించారు. మొదటిసారి ఎన్టీఆర్ కళాపరిషత్ ఏర్పాటు చేసి నాటిక పోటీలు నిర్వహించిన గుదే బ్రదర్స్‌ను పలువురు అభినందించారు. గుడివెనక నా స్వామి, వెండి అంచులు, పిపీలికం, గుర్తు తెలియని శవం నాటికలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. బహుమతి ప్రధానం ఉత్తమ ప్రదర్శనగా చీకటి పువ్వు, ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా గుర్తు తెలియని శవం, ఉత్తమ తృతీయ ప్రదర్శనగా పిపీలకంలు ఎంపికైనవి. ఉత్తమ ప్రదర్శనకు 10 వేల రూపాయలు, ద్వితీయ 8 వేల రూపాయలు, తృతీయ 6 వేల రూపాయలు, జ్యూరీకి 4 వేల రూపాయలు అందజేశారు. మిగిలిన వారికి బహుమతులు వస్తురూపంలో అందించారు. న్యాయ నిర్ణేతలుగా మల్లాది శివన్నారాయణ, టీ మధు కుమార్, కే.దేవేంద్రలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కందిమళ్ళ సాంబశివరావు, ఈశ్వర ప్రసాద్, గుదే హరి ప్రసాద్‌రావు, గుదే వెంకట సుబ్బారావు, గుద్దే శ్రీనివాసరావు, గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, రావి శ్రీనివాసరావు, మద్దినేని జయ రామకృష్ణలు, పర్యవేక్షణ నిర్వహించారు.

ఘనంగా వేమన జయంతి

విశాలాంధ్ర-గిద్దలూరు : మండల కేంద్రమైన గిద్దలూరు, మండలంలోని ముల్లపాడు, ఉయ్యాలవాడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నందు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్, సంఘ సేవకులు బియస్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేమన ఫౌండేషన్ అనంతపురం వారి ఆర్థిక సహాయ సహకారంతో గురువారం వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గిద్దలూరు మండల తహసీల్దార్ రాజా రమేష్ ప్రేమ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ అసంఘటితలను నిలువరించిన గొప్పవ్యక్తి వేమన. స్వచ్ఛమైన తెలుగులో చెప్పారన్నారు. మరుగున పడిన వేమన పద్యాలను సిపి బ్రౌన్ లాంటివారు ఇంకా కొన్ని దేశాల వారు వారి భాషలలో పుస్తకాలు ముద్రించినటువంటి సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. వేమన ప్రజా కవిగా సమాజంలో నిలబడిపోయారని తెలిపారు. వేమన రాసిన పద్యాలు చిన్నప్పటినుండి విద్యార్థిని విద్యార్థులు పాడడం అలవాటు చేసుకుంటే జీవితంలో గొప్ప వ్యక్తులుగా ఎదగవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం సిద్దేశ్వరశర్మ, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కొండా లక్ష్మీదేవి, వేమన సంక్షేమ సంఘం అధ్యక్షులు పూనూరు హనుమంతరెడ్డి, యల్లా శ్రీనివాసులు, ముల్లపాడు ప్రధానోపాధ్యాయులు గిరిధర్ శర్మ, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీల్లో విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-జెపంగులూరు : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 27వ వర్ధంతి సందర్భంగా మండలంలోని నూజిళ్లపల్లి గ్రామంలో బుధవారం ఒంగోలు జాతి నాటు ఎద్దుల పోటీలు జరిగాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టిపాటి కాజా స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను వడ్డవల్లి వీరనారాయణ ప్రారంభించారు. ఈ పోటీలలో పి.కొత్తపాలెం గ్రామానికి చెందిన కాపూరి వెంకటేశ్వర రెడ్డి ఎద్దులు 5320 అడుగులు లాగి ప్రథమ బహుమతిగా 25,116 రూపాయలు గెలుచుకున్నాయి. పలనాడు జిల్లాకు చెందిన ముద్దబోయిన నాగశాంతి ఎద్దులు 5307 అడుగులు లాగి రెండవ బహుమతిగా 15,116 రూపాయలను గెలుచుకున్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన తుమ్మల కోటయ్య ఎద్దులు 4943 అడుగులు లాగి మూడవ బహుమతిగా 10,116 రూపాయలను గెలుచుకున్నాయి. కొత్తపాలెంకు చెందిన మున్నం రుద్ర మహేశ్వరరెడ్డి ఎద్దులు 4940 అడుగులు లాగి నాలుగో బహుమతిగా 5,000 రూపా యలను గెలుచుకున్నాయి. బోయిన వారిపాలెంకు చెందిన వెంకట శివానంద్ ఎద్దులు 4560 అడుగులు లాగి ఐదవ బహుమతిగా 3,000 రూపాయలను గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కమిటీ అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు గొట్టిపాటి వెంకటరత్నకుమారి, తెలుగుదేశం పార్టీ నూజిళ్ళపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు నిరంజన్ రావు, ఉపాధ్యక్షులు విప్పర్ల పోతురాజు, బూత్ కన్వీనర్లు మద్దినేని అనిల్ కుమార్, శానం సుబ్బారావు, పెంట్యాల సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

రవి కుమార్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని మద్దిరాల ముప్పాళ్ళ గ్రామ టీడిపి సీనియర్ నాయకులు పెద్దాపూడి రవి కుమార్ దశదినకర్మ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇంచార్జి బి.ఎన్.విజయ్ కుమార్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు మండవ వాసు, బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత సెక్రటరీ జోసెఫ్, గ్రామ మాజీ సర్పంచ్ మండవ వెంకటేశ్వర్లు, తెలగతోటి జాన్సన్, పోకూరి నాగరాజు మరియు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దిగుబడులను సాధించాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : పంటలసంరక్షణ పట్ల శాస్త్రీయ పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి పి పావని అన్నారు. మండలంలోని బొడ్డువారిపాలెం గ్రామం నందు గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. పంట భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో పావని మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని తెలియజేసి సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడిని సాధించే లక్ష్యంగా వారిని తయారు చేయాలని సూచించారు. పొలంబడిలో పాల్గొన్న రైతులందరికీ 50 శాతం రాయితీపై వేపనూనెను అందజేశారు. అనంతరం చిలకపాడు మద్దులూరు గ్రామాలలో పర్యటించి ఈ పంట నమోదును తనిఖీ చేశారు. ఈ పంట నమోదు చేయించుకున్న రైతులందరూ ఈకేవైసిని కూడా చేయించుకుంటేనే వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించబోవు కొనుగోలు కేంద్రాలలో శనగ, వరి పంటల అమ్మకాలకు అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఏఏలు డి సుప్రజ, ఏ కోటేశ్వరరావు, టి వెంకటరాజా, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-అద్దంకి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకం అందుతోందని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పురపాలక సంఘ పరిధిలోని 1వ వార్డులో కృష్ణచైతన్య పర్యటించారు. ప్రతి గడపకు వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఎల్.ఎస్తేరమ్మ, కమీషనర్ టి.రవికుమార్, వార్డు కౌన్సిలర్ కొత్తగొర్ల వెంకటసుబ్బారావు(బాలు) అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శరీర ధారుడ్యానికి క్రీడలు దోహదం

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర ధారుడ్యానికి ఎంతో దోహద పడుతాయని మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గం వైసీపి పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. సీఎస్ పురం పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా కేవిస్ రాయల్, ఎస్వీ ప్రసాద్‌ల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న మెమోరియల్ మెగా క్రికెట్ పోటీలను గురువారం తిలకించి విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. పోటీలలో ప్రథమ బహుమతి 50,116 రూపాయలు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, ద్వితీయ బహుమతి 30,116 రూపాయలు సీఎస్ పురం యూత్, తృతీయ బహుమతి 15,116 రూపాయలు కటికాల రమేష్ సమకూర్చారు. ముందుగా కదిరి బాబురావు ఫైనల్ మ్యాచ్ ట్రాస్ వేసి క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిని సీఎస్ పురంకు చెందిన ప్యాంథర్స్ లెవెన్, ద్వితీయ బహుమతిని సీఎస్ పురంకు చెందిన దడ టీం, తృతీయ బహుమతిని సీఎస్ పురంకు చెందిన పీఎస్పీకే టీం గెలుచుకున్నారు. కదిరి బాబురావు మాట్లాడుతూ ప్రతి ఏడాది కేవిస్ రాయల్, ఎస్వీ ప్రసాద్‌ల జ్ఞాపకార్థం వారి మిత్రులు క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కె శ్రీధర్ తన వెంట ఉండేవాడని రాజకీయాల్లో ఎదగాల్సిన సమయంలో చిన్న వయస్సులో అకాల మరణం చెందడం విచాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి డేవిడ్, కోవిలంపాడు, బోయమడుగుల సర్పంచ్‌లు షేక్ బుజ్జి, బొట్లా చిరంజీవి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ ఇర్లా వీరాంజనేయులు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, జనసేన మండల కన్వీనర్ జానపాటి రాజ, ఎంపీటీసీ బత్తుల మాల్యాద్రి, ఇర్లా వెంకటేశ్వర్లు, మన్నేపల్లి రవికుమార్, తోట అశోక్ కుమార్, మన్నేపల్లి సురేష్, ఎల్ అంథోని, షేక్ ఖాజా, సంగిశెట్టి రమేష్, గుడిపాటి నాగేశ్వరావు, హరి, పెరుగు రమేష్, బోయిన రాయుడు, మన్నేపల్లి నవీన్ ఉన్నారు.

ఫాగింగ్ యంత్రం ప్రారంభం

ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండల కేంద్రమైన సీఎస్‌పురం పంచాయితీలో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రంను గురువారం ప్రారంభించారు. సీఎస్‌పురం పంచాయితీకి మంజూరైన 70 వేల రూపాయల విలువ చేసే ఫాగింగ్ యంత్రం పంచాయితీ ఉప సర్పంచి పాములపాటి నరసయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. సీఎస్‌పురంలో దోమలు రోజురోజుకు విజృంభించడంతో దోమలతో అల్లాడుతున్న ప్రజలకు పంచాయితీ నుంచి దోమల నివారణ ఫాగింగ్ యంత్రం మంజూరు కావడంతో ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రాంప్రసాద్, టీడీపీ నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, తోట చిన్న, సింగిల్‌విండ్ మాజీ అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, బందారు వెంకటరాముడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్ఐజీ గ్రూపుల ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి

వీవోఏలతో మాట్లాడుతున్న ఏవో

విశాలాంధ్ర-తాళ్లూరు : ఫార్మల్ ఇంటరెస్టింగ్ మహిళా గ్రూపుల ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధితో పాటు, వారి బహుళ ప్రయోజనాలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. మండలం లోని తూర్పు గంగవరం గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో మహిళా రైతుల నుద్దేశించి ఆయన ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లూరు మండలంలో 7వేలకు పైగా మహిళలు వ్యవసాయం వాటి అనుబంధ రంగాలలో ఆధారపడి జీవిస్తున్నారని, వారిని ఎఫ్ఐజి గ్రూపులుగా ఏర్పాటు చేసి వారి ద్వారా పొదుపును ప్రోత్సహించి, భవిష్యత్తులో వారి ఆర్థిక అభివృద్ధికి గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు కృషి చేయాలని ఆయన తెలిపారు. తూర్పు గంగవరం గ్రామంలోని ఏపీజీబీ యూనియన్ బ్యాంకుల ఆధ్వర్యంలో బ్యాంకు ఖాతాలను ప్రారంభించి వారి చేత పొదుపు చేయిస్తూ, పుస్తక నిర్వహణ, తదితర విషయాలను సక్రమంగా పాటించినట్లయితే ప్రభుత్వం నుండి మహిళా రైతులకు అందుతున్న పథకాలు వారికి చేరువలోకి వచ్చి, వ్యవసాయ రంగంలో అభివృద్ధిని సాధించడంతో పాటు, వారి కుటుంబాలను కూడా అభివృద్ధి చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని మహిళా రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుమ, బ్యాంకు మిత్ర విజయలక్ష్మి, వివో ఏ సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ప్రజాకవి వేమన జయంతి

విశాలాంధ్ర-రాచర్ల : చోళవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ఆధ్వర్యంలో వేమన ఫౌండేషన్ అనంతపురం వారి ఆర్థిక సహాయ సహకారంతో గురువారం వేమన జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చినగానిపల్లె గ్రామానికి చెందిన చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వేమన గురించి, వేమన చెప్పిన పద్యాల గురించి తెలియని వారు ఉండరన్నారు. వేమన కారణజన్ముడని కొనియాడారు. బాల బాలికలకు వేమన పద్యాలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలు భవ్య శ్రీ మొదట, రక్షిత రెండవ, మేఘన మూడవ బహుమతులుగావేమన ఫౌండేషన్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు రామనాయక్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ అంటే బాబు, జగన్, పవన్

- రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం
- ఈనెల 26నుంచి పాదయాత్రలు
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో 10 సంవత్సరాలు పొడిగించాలి
- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రుద్రరాజు

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని వారిలో ఎవరికి ఓటేసినా అవి బిజెపికే పోతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశం, 7 నియోజక వర్గాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రుద్రరాజు ఈసందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రత్యేకంగా బిజెపి లేదని, ఈ మూడు పార్టీలు కలిసి బిజెపిగా ఉందన్నారు. దేశంలో బిజెపి,ఆర్ఎస్ఎస్, రాష్ట్రంలో జగన్ నియంత పాలన సాగుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జరిగాయన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని, ముస్లీం మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్,ఎస్టీ,ఎస్‌సి సబ్ ప్లాన్ వంటివి తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. బిజెపి పాలనలో దళితులు,గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై దాడులు, హత్యాకాండాలు కొనసాగుతున్నాయన్నారు. రాహుల్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంతకం ఎపికి ప్రత్యేక హోదా అంశంపైనే పెడతానని హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ ను మరో 10 సంవత్సరాలు పొడిగించాలని డిమాండ్ చేశారు. రాహుల్ జోడో యాత్రకు దేశంలోనే కాకుండా రాష్ట్రంలో కూడా అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఈనెల 26న రాహుల్ జోడోయాత్ర శ్రీ నగర్‌లో ముగుస్తుందని, ఆదే రోజున రాష్ట్ర వ్యాపితంగా అన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలు ప్రారంభమవుతాయన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఈ పాదయాత్ర ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మస్తాన్ వలి,నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షులు దేవకుమార్‌రెడ్డి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి, ఎఐసిసి కార్యదర్శి సిరివెళ్ల ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, ఒంగోలు నగర అధ్యక్షురాలు దాసరి నాగలక్ష్మీ, అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ పాల్గొన్నారు.